వైద్యసేవలపై 'అధికార' ఒత్తిళ్లు

- బందరు సర్వజన ఆస్పత్రికి నేనే రాజు నంటూ బెదిరిస్తున్న టీడీపీ కార్యకర్త!
- వైద్యం చేయలేమంటున్న డాక్టర్లు, సిబ్బంది



మచిలీపట్నంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రధాన ద్వారం

మచిలీపట్నంటౌన్: 'అధికార పార్టీ నేతలు చేస్తున్న ఒత్తిళ్లతో మేమిక్కడ వైద్యం చేయలేకున్నాం. మమ్మల్ని వేరే చోటుకు బదిలీ చేయండి వెళ్లిపోతాం' అంటూ స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది గగ్గోలు పెడుతున్నారు. 'రోగులకు సరైన వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తున్నా రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటూ వివాదాలు సృష్టిస్తున్నారు. అదేమని అడిగితే గొడవలకు దిగుతున్నారు. రక్షణగా నిలవాల్సిన పోలీసులు సహకరించడం లేదు. ఫలితంగా తమపై దౌర్జన్యాలు అధికమవుతున్నాయి. దీంతో ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందికి విధుల నిర్వహణ కత్తి మీద సాములా మారింది. తాము చెప్పినట్లు వ్యవహరించకుంటే రాష్ట్ర మంత్రితో మీపై చర్యలు తీసుకునేలా చేస్తానంటూ ఒత్తిడి తెస్తున్నారని' వైద్యులు, సిబ్బంది వాపోతున్నారు. ఇలాంటి ఘటనలు కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కువవడంతో జీజీహెచ్‌లో ఈ పరిస్థితి నెలకొంది. దూరంగా ఉన్న మచిలీపట్నం జీజీహెచ్‌లోని పలు విభాగాలకు క్వాలిఫైడ్ వైద్యులు రావటమే కష్టంగా మారిన పరిస్థితుల్లో ప్రస్తుతం ఉన్న డాక్టర్లు దూరమైతే ఈ ప్రాంత రోగులకు మెరుగైన వైద్యం సైతం అందని పరిస్థితి ఎదురవుతుంది.

బెదిరిస్తున్న టీడీపీ కార్యకర్త

జిల్లా సర్వజన ఆస్పత్రికి నేనే రా'రాజు'నంటూ ఓ టీడీపీ కార్యకర్త బాహాటంగా వైద్యులను, సిబ్బందిని బెదిరిస్తున్న వైనం చోటు చేసుకుంటుండటం నిత్యకృత్యమైంది. ఆస్పత్రికి నేను చైర్మన్ అంటూ ఆ కార్యకర్త చెప్పుకుంటూ పైరవీలకు దిగుతున్నాడు. అక్కడకు వచ్చే పలువురు రోగులకు వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తున్నా ఈ కార్యకర్త హడావుడి తప్పడం లేదు. ఆస్పత్రికి వచ్చే రోగులను వైద్యుల వద్దకు తీసుకువెళ్లి మా తాలుకానే త్వరగా వైద్యం చేసి పంపడంటూ హడావుడి చేయడం ఒక ఎత్తైతే, సదరం ధ్రువీకరణ పత్రాల జారీ కోసం ప్రతి వారం పలు విభాగాల వైద్యులతో పైరవీలు చేయడం పరిపాటిగా మారిందని వాపోతున్నారు. అర్హత లేకున్నా మావాళ్లేనంటూ పర్సంటేజీ వేయాలని ఒత్తిడి చేయడం ఆయనకు రివాజుగా మారింది. వైద్యులు, సిబ్బందిపై తరచూ గొడవకు దిగుతూ మంత్రితో చెప్పి మీపై చర్యలు తీసుకుంటామని బెదిరింపుల ఘటనలు పరిపాటిగా మారింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడికి వైద్యులు ఇక్కడ వైద్యం చేసి మెరుగైన సేవలకు విజయవాడ రిఫర్ చేశారు. ఘటనకు సంబంధించి మాట్లాడేందుకు వచ్చిన ఆ టీడీపీ కార్యకర్త చైర్మన్ అయిన నా ఫోన్ తీయడం లేదు. తమాషాలు చేస్తున్నారా, చైర్మన్ అంటే కూడా మీకు లెక్క లేదా అని వైద్యుడ్ని బెదిరించడంతో ఆయన ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని వారి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో ఇది చూసిన ఇతర విభాగాల వైద్యులు, సిబ్బంది కూడా మమ్మల్ని కూడా ఇతను పలుమార్లు బెదిరించాడని పెద్ద ఎత్తున చాటింగ్ జరిగినట్లు వినికిడి. 'చైర్మన్ అయిన తనకు గౌరవం ఇవ్వకపోతే మీరు ఇక్కడ ఎలా ఉద్యోగాలు చేస్తారో చూస్తాను... మంత్రి గారికి చెప్పి క్షణాల్లో పీకించేస్తానని బెదిరించి తమతో పనులు చేయించుకుంటున్నాడని వారు చాటింగ్ చేయటం చూస్తుంటే' ఆస్పత్రిలో ఇతను చేస్తున్న హడావుడిని అర్థం చేసుకోవచ్చు. ఇప్పకైనా కూటమి ప్రభుత్వ నాయకులు, ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో చోటు చేసుకుంటున్న పరిస్థితులను చక్కదిద్ది వైద్య సేవలు సజావుగా అందించేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

తరచూ హడావుడి తప్పడం లేదు

జీజీహెచ్‌లో వైద్యం కోసం వచ్చే రోగుల బంధువులు, రాజకీయ నాయకుల హడావుడి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నా ఇవి తప్పడం లేదు. దీంతో కొంత ఇబ్బంది జరుగుతోంది. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లాం. ఇలాంటి ఘటనలను పట్టించుకోకుండా పనిచేయాలని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన మాకు హామీ ఇచ్చారు. జీజీహెచ్‌లోని వైద్యులు, సిబ్బందికి తమ నుంచి ఎలాంటి ఒత్తిళ్లు ఉండవని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సూచించారు.

–శ్రీనివాసరావు, డెప్యూటీ సూపరింటెండెంట్, జీజీహెచ్, మచిలీపట్నం

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివి

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఈ నెల 25వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీవీ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. నగరంలోని చమ్మన గిరిపేట, రుస్తుం బాధ, రాజా గారి సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

గ్రామ స్వరాజ్యమే ధ్యేయం



వెంకటాపురం(మోపిదేవి): గ్రామ స్వరాజ్య సాధనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో ఏడు రోడ్లను సీసీ రహదారులుగా మార్చడానికి భూమి పూజ నిర్వహించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్ తుమ్మా సోములమ్మ, సీడీసీ మాజీ చైర్మన్ రావి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుపై అవగాహన



అవనిగడ్డ: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుపై సీనియర్ న్యాయవాది తిమ్మన సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. కోర్టు ప్రాంగణంలో ఎమ్మెల్సీ ఓటు ఆవశ్యకతపై న్యాయవాదులు ప్రదర్శన చేశారు. పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మత్తి వెంకటేశ్వరరావు, పర్చూరి రాఘవేంద్రరావు, బొప్పన సుబ్రహ్మణ్యం, నాగరాజుతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు స్టడీమెటీరియల్



గోగినేనిపాలెం(ఘంటసాల): ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్లో పదో తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలు రావడానికి కృషి చేస్తున్నట్లు గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న 26 మంది విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు గోపాలం జయ స్వచ్ఛందంగా సోషల్ స్టడీ మెటీరియల్‌ను హెచ్ఎం వేణు గోపాలరావు చేతుల మీదగా గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, సహోపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల కోసమే..

పెడన: పురపాలక సంఘ కార్యాలయం సమీపంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మెప్మా బజార్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ భోగేశ్వర రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన వాటిని విక్రయించడానికి మార్కెటింగ్‌కు అనువుగా మెప్మా బజార్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

దాళ్వాకు నీరు ఇవ్వండి



బంటుమిల్లి: మండలంలో ఈ సంవత్సరం రెండో పంట దాళ్వా సాగుకు నీరు సరఫరా చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యాన గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలోని ఆయకట్టు భూములు చౌడు భూములు అన్నారు. రెండో పంట లేకపోతే భూములు చౌడుబారిన పడతాయని నాయకులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి నీరు సరఫరా చేయాలని కోరారు. డెప్యూటీ తహసీల్దార్ పూర్ణచంద్రరావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం, రైతు సంఘం, సీఐటీయూనాయకులు జి. నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ దుకాణాలకు నేడు బహిరంగ వేలం

పెడన: పురపాలక సంఘ పరిధిలో నాలుగు ప్రాంతాల్లోని 20 దుకాణాలకు రిజర్వేషన్ల ప్రకారం అద్దెకు ఇవ్వడానికి శుక్రవారం బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా వాణిజ్య సముదాయంలో ఏడు, శ్రీమహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 4, బంటుమిల్లి రోడ్డు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 2, పాత కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏడు ఖాళీలున్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కమిషనర్ పేర్కొన్నారు.

శైవక్షేత్రాలు, పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

అవనిగడ్డ: రానున్న కార్తిక మాసం పురస్కరించుకుని అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి శైవక్షేత్రాలు, పంచారామాలకు ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటను ఒకే రోజు దర్శించుకునేలా స్పెషల్ బస్‌లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు బ్యాచ్‌లుగా ముందుకు వస్తే వారి కోసం ప్రత్యేక బస్ సర్వీసుని అందిస్తామన్నారు. కార్తిక మాసం మొత్తం ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు అవనిగడ్డ నుంచి శ్రీశైలానికి స్పెషల్ లగ్జరీ సర్వీసును నడుపుతున్నట్లు తెలిపారు. శబరిమలకు వెళ్లే భక్తులు ముందుకు వస్తే వారికోసం ఇటీవల డిపోకు కొత్తగా వచ్చిన బస్ సర్వీసులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99592 25466, 73828 99427 నంబర్లలో సంప్రదించాలని డీఎం సూచించారు.

ఇళ్ల మధ్య మద్యం షాపు వద్దు

పాత సంతబజారు రోడ్డులో మహిళల ఆందోళన


ఘంటసాల పాత సంతబజారు రోడ్డులో ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

ఘంటసాల: 'మా గృహాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయొద్దని' కోరుతూ ఘంటసాల మల్లంపల్లి రోడ్డులోని పాత సంతబజారు, జగనన్న కాలనీ వాసులు, మహిళలు గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ బి.కనకదుర్గకు, మొవ్వ ఎక్సైజ్ సీఐ బి.వరాలరాజులకు వినతిపత్రాలను అందించారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ ఘంటసాల మల్లంపల్లి రోడ్డులోని పాత సంతబజారులో మద్యం షాపు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలానికి 100 మీటర్ల లోపు సీఎస్ఐ చర్చి, ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం, రామాలయం, ప్రథమచికిత్స కేంద్రం, గొర్రెపాటి విద్యాట్రస్టు, అంబేద్కర్ విగ్రహం, రేషన్ షాపు, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయన్నారు. జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి కూడా ఉంది. ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేస్తే కాలనీ వారు, మేము ఇటుగా వెళ్లాలంటే ఇబ్బంది పడతామని తెలిపారు. మద్యం దుకాణాలకు ఇస్తే మందుబాబు ఆగడాలు అధికంగా ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మద్యం షాపును ఊరి శివార్లలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాక సత్రవు సెంటర్ నుంచి అంబేడ్కరనగర్ వరకు ఎక్కడా మద్యం షాపు పెట్టకుండా చూడాలని విన్నవిస్తున్నట్లు ఆ ప్రాంత మహిళలు, విద్యార్థులు, నివాసితులు కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రోజా, లోకేశ్వరి, చందన, నాగలక్ష్మి, ఉమ, లక్ష్మీ నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల ఏర్పాటు ప్రాంతం పరిశీలన

ఘంటసాల మల్లంపల్లి రోడ్డులో పాత సంతబజారులో మద్యం షాపులు ఏర్పాటు చేసే ప్రదేశాలను కృష్ణా జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధర్ గురువారం పరిశీలించారు. గత రెండు రోజులుగా ఆయా ప్రాంతాల మహిళలు ఆందోళన చేస్తూ అర్జీలు ఇచ్చిన నేపథ్యంలో పరిశీలించినట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా వేరే ప్రాంతంలో షాపులు ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత యజమానులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఈఎస్ భార్గవ, మొవ్వ ఎక్సైజ్ సీఐ బి.వరాల రాజు, ఎస్ఐ లక్ష్మీకాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

● డ్రెయిన్ కాదు రోడ్డే..



పురపాలక సంఘ పరిధిలోని 16వ వార్డు గ్రంథాలయం వద్ద మురుగునీరు రోడ్డుపై పారుతోంది. శానిటరీ సిబ్బంది వస్తున్నారు.. వెళ్తున్నారు.. కానీ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ ఉన్నా.. రోడ్డుపై మురుగు పరుగులీస్తోందని.. రెండు నెలలుగా ఇదే పరిస్థితి అని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

–పెడన

నేడు సమన్వయ కమిటీ సమావేశం

మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నాగుల చవితి సందర్భంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం ఆలయ ప్రాంగణంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. నవంబర్ 5 నాగులచవితి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని ముందస్తు ఏర్పాట్లుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

11 నుంచి శ్రీ పాండురంగస్వామి ఉత్సవాలు



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలోని చిలకలపూడి కీర పండరీపురంలో వేంచేసి ఉన్న శ్రీ పాండురంగ స్వామి వారి ఉత్సవాలు నవంబర్ 11 నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు టేకి నరసింహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి ఉత్సవాలు నవంబర్ 11వ తేదీ కార్తిక శుద్ధ దశమి సోమవారం ప్రారంభమై పౌర్ణమి 15వ తేదీ శుక్రవారం వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

పశువైద్యశాలకు మరమ్మతులు చేయండి

వెంకటాపురం(మోపిదేవి): శిథిలమైన పశువైద్యశాలకు మరమ్మతులు చేపట్టాలని పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ కోరారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, సీడీసీ మాజీ చైర్మన్ రావి నాగేశ్వరావు గురువారం పశువైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిథిలమైన బిల్డింగ్ చూపించారు. పశు వైద్యపరికరాల అవసరాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు.

మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

నాగాయలంక: సొర్లగొంది గ్రామానికి చెందిన కొప్పనాతి సురేష్‌ను గురువారం నాగాయలంకలో పట్టుకుని అతని నుంచి 50మద్యం బాటిళ్ల(ఒక్కొక్కటి 180ఎం.ఎల్) స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎస్ఐ కలిదిండి రాజేష్ చెప్పారు. స్థానిక మద్యం దుకాణాల్లో అధికంగా మద్యం కొనుగోలు చేసి తన ఇంటివద్ద బాటిళ్లను అక్రమంగా ఉంచి అధిక ధరలకు అమ్ముతున్నట్లు సమాచారం వచ్చింది. సిబ్బందితో వెళ్లి రేమాలవారిపాలెం వంతెన సెంటర్‌లో అనుమతి లేని అధిక మద్యం బాటిల్స్‌తో ఉన్న సురేష్‌ను పట్టుకున్నామని చెప్పారు. మద్యం బాటిల్స్ అన్ని షాపుల్లో కొన్నట్టు చెప్పాడని, అక్రమంగా అధిక రేట్లుకు మద్యం అమ్ముతున్నట్లు అంగీకరించాడని తెలిపారు. 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

భూసర్వేతో రైతులకు మేలు


మెరకనపల్లి గ్రామసభలో కరపత్రాలను రైతులకు అందిస్తున్న అధికారులు

మెరకనపల్లి(మోపిదేవి): భూ రీ సర్వేతో రైతులకు మేలు జరుగుతుందని మండల సర్వేయర్ రామకృష్ణబాబు తెలిపారు. మండలంలోని మెరకనపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ రీ సర్వే ప్రాజెక్ట్- రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కార కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గ్రామసభలో ఒక దరఖాస్తు అందినట్లు సర్వేయర్ తెలిపారు. డీటీ వాణి, ఇన్‌చార్జి ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్ నడకుదుటి గోపీరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు.

కృత్తివెన్ను: ఇటీవల జరిగిన భూముల రీ సర్వేపై అభ్యంతరాలు స్వీకరించడానికి నీలిపూడిలో రీ సర్వే గ్రామసభను గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా సంబంధిత రైతుల పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం మొదలైన వాటిలో ఏవైనా తప్పులుంటే రైతులు అర్జీ రూపంలో తెలియజేసుకుని వాటిని మార్చుకోవచ్చని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సోమేశ్వరరావు, డీటీ శశికుమార్, సర్పంచ్ పాశం కృష్ణ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వరద నష్ట పరిహారం అందించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత చిన్నారి, వరద బాధిత మహిళలు

నాగాయలంక: ఇటీవల వచ్చిన వరదలకు నాగాయలంక చిన కరకట్ట కింద దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వలేదంటూ 11 కుటుంబాల బాధితులు గురువారం స్థానిక తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు తెలిపారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరక్టర్, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ నేత మద్ది వెంకటనారాయణ(చిన్నారి)నేతృత్వంలో కట్ట కింద 11మంది వరద ప్రభావిత బాధితులు(మహిళలు) తమకు రావల్సిన ప్రభుత్వ నష్టపరిహారం అందలేదని తహసీల్దార్‌కు చెప్పుకున్నారు. అర్జీ రాసి ఇవ్వండి.. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి వివరించారు. ఆ మేరకు వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా చూస్తామని తహసీల్దార్ భరోసా ఇచ్చారు.

చిలకలపూడి పీఎస్‌లో ఓపెన్‌హౌస్


పోలీసుల విధులు వివరిస్తున్న సీఐ నభీ

కోనేరుసెంటర్: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు విధులు, చట్టాలు, సెక్షన్లపై సీఐ నబీ విద్యార్థులకు వివరించారు. ఒక్కో స్టేషన్‌లో ఎంత మంది పోలీసులు విధులు నిర్వహిస్తారు. ఏఏ ర్యాంకుల్లో వారిని ఎలా సంభోదిస్తారు. నేరస్థులకు ఎలా కౌన్సిలింగ్ ఇస్తారు. ఫిర్యాదుదారులతో ఏ విధంగా మసలుకుంటారు. ఏ ఏ ఫిర్యాదును ఏ విధంగా పరిగణలోకి తీసుకుని కేసులు కడతారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి సీఐ స్థాయి వరకు వారి విధులు, రికార్డులు ఏ విధంగా తయారుచేస్తారు. ఎలాంటి సెక్షన్లతో కేసులు ఫైల్ చేస్తారు వంటి విషయాలను వివరించారు.

ఆయుధాలను ఎలాంటి సమయాల్లో ఉపయోగిస్తారో విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎస్సై సుబ్రహ్మణ్యం, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో పోలీసు అమర వీరుల వారోత్సవాల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీని ఉపయోగించి ఫోన్ల ద్వారా బ్యాంకు ఎకౌంట్లను హ్యాక్ చేయడం, ఏటీఎంలో నగదు, ఫేక్ ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మేసేజ్‌ల ద్వారా వివిధ లింకులు పంపి ఓటీపీ చెప్పడం ద్వారా మోసగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

పంటల బీమాపై అవగాహన కల్పించండి

చిలకలపూడి(మచిలీపట్నం): రబీ సీజన్‌కు పంటలు వేసిన రైతులందరికీ పంటల బీమాపై అవగాహన కలిగించి నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం సచివాలయం నుంచి 2024–25 రబీ పంటల బీమా నమోదుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు వేసిన ప్రతి రైతు బీమా చేసుకునేందుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ బాలాజీ జిల్లా అధికారులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్లు, వ్యవసాయ సహాయ సంచాలకులకు పంటల బీమాపై అవగాహన కలిగించి జిల్లా వ్యాప్తంగా రైతులను పంటల బీమాలో నమోదు చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జేసీ గీతాంజలిశర్మ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పద్మావతి, కేడీసీసీబీ సీఈవో శ్యామ్‌మనోహర్, వ్యవసాయశాఖ డీడీ మనోహర్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌పై దృష్టి పెట్టండి

స్వర్ణాంధ్ర విజన్–2047పై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సచివాలయం నుంచి స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వనరుల గురించి కలెక్టర్ డీకే బాలాజీ సీఎస్‌కు వివరించారు. సీపీఓ గణేష్ కృష్ణ, డ్వామా పీడీ కె.వి. శివప్రసాద్, హౌసింగ్ పీడీ ఎస్. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో ఇసుక రీచ్‌లకు అనుమతి లేదు

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండలంలో ఎక్కడా ఇసుక రీచ్‌లకు అనుమతి లేనందున ఎవరన్నా శాండ్ తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వనజాక్షి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే ఉచిత ఇసుకను తీసుకెళ్లాలన్నారు. చల్లపల్లి మండలం సీఆర్‌జడ్ పరిధిలో ఉన్నందున ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎడ్లబళ్లపై ఇసుక రవాణా నిషేధమని ఎవరన్నా అతిక్రమిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ ఘంటసాల కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

మందుబాబుల అడ్డాగా పాత పంచాయతీ ప్రాంగణం!


మోపిదేవి పంచాయతీ కార్యాలయ ఆవరణలో మందు సీసాలు, గ్లాసులు తొలగిస్తున్న సిబ్బంది

మోపిదేవి: పాత పంచాయతీ కార్యాలయం లోపల మందు బాబులు వేసిన మందుసీసాలు, గ్లాసులు పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. మోపిదేవి పాత పంచాయతీ కార్యాలయం మందు బాబులకు అడ్డాగా మారింది. కొత్త భవనం నిర్మించడానికి గతంలో పాత భవనాన్ని తొలగించారు. ప్రస్తుతం ఆ ప్రాంతం ఖాళీగా ఉండటంతో మందు బాబులకు అనుకూలంగా మారింది. ప్రధాన సెంటర్‌లో ఉండటం, ఎదురుగా శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఉన్నా, మందు బాబులకు ఏమాత్రం భయం లేదు. వారిక్కడ మందు తాగి ఆ సీసాలు, గ్లాసులు వదిలివేయడంతో పంచాయతీ చెత్తకుప్పగా మారింది. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోడూరు ఇన్‌చార్జి కార్యదర్శిగా శేషగిరిరావు

కోడూరు: కోడూరు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా బొలిశెట్టి శేషగిరిరావు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ కార్యదర్శిగా విధులు నిర్వహించిన యలవర్తి సుబ్రహ్మణ్యం రెండు నెలల కితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి నాగాయలంక కార్యదర్శి జరుగు పవన్ ఇన్‌చార్జీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పులిగడ్డ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శేషగిరి రావుకు కోడూరు పంచాయతీ బాధ్యతలు అప్పగించారు. శేషగిరిరావు ఎంపీడీఓ సుధాప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.